నేలపై కూర్చొని.. పిల్లలతో మమేకమై..

కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి అంగన్‌వాడీ చిన్నారులతో మమేకమయ్యారు. తిమ్మాపూర్ మండలం రామకృష్ణకాలనీలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో నిర్వహించిన శుక్రవారం సభ కార్యక్రమానికి హాజరైన ఆమె, ఇలా చిన్నారులతోపాటు నేలపై కూర్చొని వారిలో కలిసిపోయారు. పిల్లలతో కొద్దిసేపు ఆనందంగా గడిపారు. వారితో కథలు చెప్పించుకుని, పాటలు పాడిస్తూ, నృత్యం చేయించారు. విశాల్ అనే బాలుడు తన తల్లిదండ్రులు బతుకుదెరువు కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లగా.. నానమ్మ దగ్గర ఉంటున్నానని చెప్పడంతో దగ్గరకు తీసుకుని బాగా చదువుకోవాలని ఆప్యాయంగా మాట్లాడారు. **- తిమ్మాపూర్, ఆగస్టు 2**

నేలపై కూర్చొని పిల్లలతో ముచ్చటిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు

ఎస్సారెస్పీలోకి వరద

- మొన్నటి వరకు డెడ్‌స్టోరేజీ
- గతేడాది ఇదే పరిస్థితి
- ప్రాణం పోసిన పునర్జీవ పథకం
- అంతలోనే ఎగువన వర్షాలు
- ఈసారి ఖాళీగా ప్రాజెక్టు
- క్యాచ్‌మెంట్ ఏరియాలో వానలు
- ప్రాజెక్టులోకి స్థిరంగా ఇన్‌ఫ్లో
- శుక్రవారం సాయంత్రం వరకు 40వేల క్యూసెక్కులు
- 40 టీఎంసీలకుపైగా చేరిక
- ఆయకట్టు రైతుల్లో ఆశలు

ఉత్తర తెలంగాణ వరదాయిని శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వరద ప్రవాహం మొదలైంది. వారం పది రోజుల నుంచి నీరు వచ్చి చేరుతుండడంతో క్రమంగా నీటి మట్టం పెరుగుతున్నది. మొన్నటి వరకు డెడ్‌స్టోరీకి చేరువలో కనిపించినా.. ఇప్పుడు 40 టీఎంసీలకుపైగా నీటి నిల్వతో జలకళను సంతరించుకుంటున్నది.

జగిత్యాల, ఆగస్టు 2 (నమస్తే తెలంగాణ) : శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కింద ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్ జిల్లాలకు సాగు, తాగునీరు అందుతున్నది. 80 టీఎంసీల సామర్థ్యమున్న ఈ ప్రాజెక్టు కింద తొమ్మిది లక్షల ఎకరాల ఆయకట్టు ఉన్నది. ప్రాజెక్టు నిండని ప్రతిసారి ఉత్తర తెలంగాణ రైతాంగానికి ఇబ్బందికర పరిస్థితి తలెత్తుతున్నది. ఎస్సారెస్పీ ప్రాజెక్టు క్రమంగా వట్టిపోతుండడం, ఎగువ ప్రాంతంలోని మహారాష్ట్ర వాళ్లు గోదావరిపై విచ్చలవిడిగా ప్రాజెక్టులు, బ్యారేజ్‌లు నిర్మించడంతో దిగువకు నీరందని దుస్థితి నెలకొన్నది. గతేడాది సైతం ఇలాంటి పరిస్థితులే ఉత్పన్నమైనా, కేసీఆర్ సర్కారు కాళేశ్వరం నీటిని ఎత్తిపోసింది. పోయినేడు జూలై ప్రారంభంలో ఎస్సారెస్పీలో నీరు కనిష్ఠానికి చేరుకోగా, ఎస్సారెస్పీ పునర్జీవ పథకం జీవం పోసింది. మేడిగడ్డ నుంచి నీటిని ఎత్తిపోసి, రామడుగు గాయత్రీ పంప్‌హౌస్‌కు తరలించి, వరద కాలువ ద్వారా రాంపూర్ పంప్‌హౌస్‌కు, అక్కడి నుంచి నీటిని ఎత్తిపోసి మెట్‌పల్లి మండలం రాజేశ్వర్‌రావుపేట పంప్‌హౌస్‌కు, తిరిగి అక్కడి నుంచి ముప్కాల్ పంప్‌హౌస్ వరకు తరలించి, ఎస్సారెస్పీలోకి నీటిని పంపించే ప్రక్రియను విజయవంతం చేశారు. దాదాపు మూడు టీఎంసీలు తరలించారు. అయితే గతేడాది జూలై రెండో వారంలో వరుణుడు కరుణించడం, ఎగువన విస్తారంగా వర్షాలు పడడంతో వారం వ్యవధిలోనే ఎస్సారెస్పీ నిండుకుండలా మారిపోయింది. కానీ, ఈ యేడాది మొన్నటి వరకు ఆ పరిస్థితి లేదు. అటు మహారాష్ట్ర, ఇటు తెలంగాణలోని ఎస్సారెస్పీ క్యాచ్‌మెంట్ ఏరియాలో వర్షాలు లేక ప్రాజెక్టు పూర్తిగా డెడ్‌స్టోరేజీకి చేరింది. జూన్‌లో చుక్క నీరు రాలేదు. జూలై ప్రారంభమై రెండువారాలు గడిచినా నీటి జాడ కానరాలేదు. అయితే జూలై మూడో వారం నుంచి నీటి ప్రవాహం కొద్దిగా ప్రారంభమైంది. జూలై 13 నుంచి వందల క్యూసెక్కుల ప్రవాహం మొదలు కాగా, అది మెల్లగా పెరుగుతూ పోయింది. జూలై 18 నాటికి 25వేల క్యూసెక్కులకు పెరిగి, ప్రాజెక్టులో నీటినిల్వ 14.450 టీఎంసీలకు చేరుకున్నది. అప్పటి నుంచి క్రమంగా ప్రవాహం పెరుగుతూనే ఉన్నది. సగటున రోజుకు 20వేల క్యూసెక్కులు వస్తుండగా, జూలై 28 నాటికి ప్రాజెక్టు 31 టీఎంసీలకు నీరు చేరింది. ఇరు రాష్ట్రాల్లోని ప్రాజెక్టు క్యాచ్‌మెంట్ ఏరియాలో వాన సమృద్ధిగా పడుతుండడంతో ఆగస్టు ఒకటి నుంచి ప్రాజెక్టులోకి గతం కంటే ఎక్కువ నీటి ప్రవాహం రావడం ఆరంభమైంది. గురువారం మధ్యాహ్నం 3 గంటల వరకు 28వేల క్యూసెక్కులు నమోదు కాగా, సాయంత్రం 6 గంటల వరకు 40వేల క్యూసెక్కులకు చేరుకున్నది. శుక్రవారం సాయంత్రం వరకు ఇది మరింతగా పెరిగింది. మధ్యాహ్నం 3 గంటల వరకు 53 వేల క్యూసెక్కులు వస్తుండడంతో ప్రాజెక్టు క్రమంగా జలకళను సంతరించుకుంటున్నది. సాయంత్రం వరకు 40 టీఎంసీలకు పైగా నీరు చేరడంతో అధికారులు, రైతులు సైతం ఊపిరిపీల్చుకున్నారు. ప్రాజెక్టు నిబంధనల ప్రకారం 40 టీఎంసీల నీరు చేరితేనే సేద్యానికి నీటి విడుదల చేయాల్సి ఉండగా, జగిత్యాల, నిజామాబాద్ రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. కనీసం వానకాలం పంటకైనా నీరందుతుందనే ఆశలు చిగురిస్తున్నాయి.

సుప్రీం తీర్పుపై ఆనందహేల

రుద్రంగి: సంబురాల్లో దళిత సంఘాల నాయకులు

ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇస్తూ తీర్పు ఇవ్వడంపై ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా దళితులు సంబురాలు చేసుకున్నారు. ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ చిత్ర పటానికి పాలాభిషేకం చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. సుదీర్ఘకాలంగా ఉన్న సమస్యకు నేడు పరిష్కారం లభించిందని సంతోషం వ్యక్తం చేశారు. బడుగు బలహీన వర్గాలు అభివృద్ధి చెందాలంటే వర్గీకరణ ద్వారానే సాధ్యమవుతుందని చేసిన పోరాటానికి నేడు ఫలితం లభించిందన్నారు. ప్రభుత్వ నోటిఫికేషన్స్, విద్య, ఉద్యోగ అవకాశాల్లో ఎస్సీ ఉపకులాలకు ప్రాధాన్యత కల్పించాలని కోరారు. **- జగిత్యాల, ఆగస్టు 2(నమస్తే తెలంగాణ)**

మాజీ సర్పంచ్‌ల నిర్బంధం

కరీంనగర్ రూరల్: పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న మాజీ సర్పంచులు

గ్రామాల అభివృద్ధి కోసం చేసిన పనుల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ నిరసనబాట పట్టిన మాజీ సర్పంచులను ఎక్కడికక్కడ నిర్బంధించారు. సెక్రటేరియట్ ముట్టడికి బయలుదేరేందుకు సిద్ధం కాగా.. పోలీసులు ముందస్తు అరెస్ట్‌లు చేశారు. దీంతో మాజీ సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆయా మండలాల్లోని పోలీస్‌స్టేషన్లలో నిరసనలకు దిగారు. అధికారంలోకి వచ్చిన తర్వాత బిల్లులు చెల్లిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చి మరిచిపోయారని ధ్వజమెత్తారు. బిల్లులు చెల్లించాలని అడిగితే అక్రమంగా అరెస్ట్‌లు చేస్తారా..? అని మండిపడ్డారు. తమ సమస్యలను ముఖ్యమంత్రికి విన్నవించేందుకు వెళ్లేందుకు సిద్ధమైతే ఇండ్ల వద్దనే ఇలా అరెస్ట్ చేయడం సరికాదన్నారు. అక్రమ అరెస్ట్‌లతో ఉద్యమాన్ని అడ్డుకోవాలని చూస్తే ఉద్యమం మరింత ఎగిసిపడుతుందని హెచ్చరించారు. **- జగిత్యాల, ఆగస్టు 2(నమస్తే తెలంగాణ)**

నర్సింగ్ స్కూల్.. సమస్యలు ఫుల్

ఇరుకు గదుల్లో నర్సింగ్ క్లాసుల నిర్వహణ

- శిథిలావస్థలో పాఠశాల
- అస్తవ్యస్తంగా డ్రైనేజీ
- కూలిపోతున్న వసతి గృహం ప్రహరీ
- ఇరుకు గదుల్లో తరగతుల నిర్వహణ
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

కరీంనగర్ ప్రభుత్వ దవాఖానకు అనుబంధంగా ఉన్న నర్సింగ్ పాఠశాల సమస్యలకు కేరాఫ్‌లా మారింది. నర్సింగ్ సిబ్బందికి క్వార్టర్లల కోసం కేటాయించిన ఓ పురాతన భవనంలో దీనిని నిర్వహిస్తుండగా ఇప్పటి వరకు సొంత భవనానికి కూడా నోచుకోలేదు. పైగా శిథిలావస్థకు చేరుకున్న భవనంలో విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పాములు, తేళ్లు, ఇతర విష కీటకాలతో నిత్యం సావాసం చేస్తున్నారు. ర్యాంకులు సాధించడంలో, ఉద్యోగాలు పొందడంలో గొప్ప పేరున్న ఈ పాఠశాల పరిస్థితిని చూస్తే ప్రతి ఒక్కరూ చలించిపోవాల్సిందే.

కరీంనగర్ విద్యానగర్, ఆగస్టు 2 : కరీంనగర్ నర్సింగ్ పాఠశాలకు 'పేరుగొప్ప ఊరు దిబ్బ' అనే సామెత సరిగ్గా సరిపోతుంది. 2013లో అప్పటి ప్రభుత్వం స్థానిక ప్రభుత్వ దవాఖానకు అనుబంధంగా ఏర్పాటు చేసింది. అందులో ఇంటర్‌కు సమానంగా ఉత్తీర్ణులైన విద్యార్థులకు మెరిట్ ఆధారంగా మూడేళ్ల జీఎన్ఎం కోర్సులో చేరేందుకు అనుమతి ఉంటుంది. 42 సీట్లలో ఇద్దరు ఇన్‌సర్వీస్ సిబ్బందికి కేటాయిస్తారు. ఇలా మూడేళ్లలో 126 మంది నర్సింగ్ విద్యను అభ్యసించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇప్పటి వరకు 10 బ్యాచ్‌లకు పైగా విద్యార్థులు విద్యను అభ్యసించగా, ప్రతి సంవత్సరం వందశాతం ఉత్తీర్ణత సాధించడమే కాకుండా ఎక్కువ శాతం డిస్టింక్షన్లు తెచ్చుకుంటున్నారు. 2024లో 50 మంది విద్యార్థులు స్టాఫ్ నర్స్‌లుగా ఉద్యోగం సాధిస్తున్నారు. క్రమశిక్షణ, విలువలతో కలిగిన విద్యను బోధించడంలో ఈ పాఠశాలకు రాష్ట్రంలోనే మంచి పేరుంది. రాష్ట్ర వ్యాప్తంగా గాంధీ, ఉస్మానియా, ఎంజీఎం, కరీంనగర్, బోధన్, నిజామాబాద్‌లో 6 నర్సింగ్ పాఠశాలలు ఉండగా, అందులో ఒక్క కరీంనగర్‌కు తప్ప మిగతా అన్నింటికీ సొంత భవనాలు ఉన్నాయి. ఇతర పాఠశాలల మాదిరిగా ల్యాబ్‌లు, స్కూల్ బస్సులు, పర్మినెంట్ టీచింగ్ స్టాఫ్, ఆఫీస్ సిబ్బందిని ఇప్పటి వరకు సమకూర్చలేదు. కేవలం దవాఖానలో నర్సింగ్ విద్యార్థులు సేవలందిస్తున్నారనే భానవతో మొదటి నుంచి సూపరింటెండెంట్లు పాఠశాల అవసరాలను తీర్చుతున్నారు. వీరికి కావాల్సిన తరగతి గదులు, వసతి గృహం కోసం దవాఖాన ఆవరణలోనే నర్సింగ్ స్టాఫ్‌కు కేటాయించిన పాత భవనాలను కేటాయించారు. ఆ భవనాలు శిథిలావస్థకు చేరుకోగా గత ప్రభుత్వం మరమ్మతుల కోసం ₹20 లక్షలు ఖర్చు పెట్టింది. అయినా, భవన రూపురేఖలు యథావిధిగా ఉండి వర్షం కురిసినప్పుడల్లా పెచ్చులూడుతున్నాయి. భవనంలోని గదులు బీటలు వారుతున్నాయి. పిచ్చి మొక్కలు, చెత్తా చెదారం ఎక్కువగా ఉండడంతో రోజూ పాఠశాల ఆవరణలో పాములు, తేళ్లు, విష పురుగులు స్వైర విహారం చేస్తున్నాయి.

శిథిలావస్థకు చేరిన నర్సింగ్ స్కూల్ భవనం

అపరిశుభ్రంగా నర్సింగ్ పాఠశాల ఆవరణ

హాస్టల్‌లో అన్నీ ఇక్కట్లే

తరగతి గదుల పరిస్థితి ఇలా ఉంటే ఇక హాస్టల్లోనూ సమస్యలు తిష్ట వేశాయి. గదులు సరిపోక నర్సింగ్ సిబ్బందికి కేటాయించిన ఫ్యామిలీ పోర్షన్లలో కాలం వెళ్లదీస్తున్నారు. హాస్టల్లో పడుకునేందుకు సరైన బెడ్స్ లేకపోవడంతో వర్షాకాలంలో నీరు చేరి విద్యార్థులకు కంటి మీద కునుకు లేకుండా పోతున్నది. అంతే కాకుండా, హాస్టల్‌కు సంబంధించిన డ్రైనేజీ లేక పోవడంతో విద్యార్థులు వాడిన వ్యర్థపు నీరు బయటికి వెళ్లే పరిస్థితి కనిపించడం లేదు. అసలు ఈ హాస్టల్‌కు డ్రైనేజీతో లింకే లేకుండా పోయింది. భవనంతో పాటు వసతి గృహం ల్యాబ్‌లు సమకూర్చలే దు. అంతేకాకుండా పాఠశాల ప్రారంభం నుంచి పర్మినెం ట్ ట్యూటర్స్‌ను కూడా నియమించ లేదు. డిప్యూటేషన్లపైనే కాలం గడుపుతున్నారు. హాస్టల్ నుంచి క్లాసుకు వెళ్లాలన్నా, క్లినికల్స్ కోసం దవాఖానకు వెళ్లాలన్నా విద్యార్థులకు ఇబ్బందిగా మారింది. దారి బురదమయంగా మా రింది. సరైన వసతి గృహం, తరగతి గదులు లేక విద్యార్థులు విశ్రాంతి తీసుకునేందుకు సైతం వీలు లే కుండా పోయింది. రాష్ట్రంలోనే అత్యధిక మార్కులు, ఉ ద్యోగాలు సాధిస్తున్నట్టు రికార్డుల్లోకి ఎక్కిన ఈ పాఠశాల లో ఇన్ని సమస్యలు ఉంటాయంటే ఎవరూ నమ్మలేని పరిస్థితి.

హాస్టల్ చుట్టూ విష పురుగులే

హాస్టల్ పరిసరాల్లో పూర్తిగా గడ్డి పెరగడంతో హాస్టల్ చుట్టూ రోజూ పాములు, తేళ్లు, ఇతర విష పురుగులు కనిపిస్తున్నాయి. విద్యార్థులు బయటకు వెళ్లాలంటే భయపడుతున్నారు. పంది కొక్కులు మట్టిని తోడడంతో కుంగిపోయి గోతులు కనిపిస్తున్నాయి. బట్టలు శుభ్రం చేసుకునేందుకు వాష్ ఏరియా కూడా లేదు. డ్రైనేజీ సరిగా లేకపోవడంతో తీవ్ర దుర్గంధం వస్తుంది. అనారోగ్యం బారిన పడుతున్నాం.

- సాయి అంజలి, నర్సింగ్ విద్యార్థిని

విద్యార్థినులు ఉంటున్న గది

ఎక్కడా చూసినా లీకేజీలే

స్లాబ్ పెచ్చులూడుతున్నాయి. రోజూ వర్షాలు పడుతుండడంతో స్లాబ్ పైన నీరు నిల్వ ఉండి లీక్ అవుతున్నది. రూంలో ఉంటే వర్షానికి కూలుతుందేమోనని భయం వేస్తుంది. ఒకే రూంలో పది మందికి పైగా ఉండడంతో వాష్ రూంలకు ఇబ్బందిగా ఉంది. బెడ్స్ లేక కింద పడుకుంటే విష పురుగుల భయం వెంటాడుతున్నది. తరగతి గదులు, వసతి గృహం సరిగ్గా లేక చాలా ఇబ్బంది పడుతున్నాం. వానకాలం వచ్చిందంటే పాఠశాలతో పాటు వసతి గృహం ముందు రోడ్డు బురదమయంగా మారుతుంది.

- సౌమ్య, నర్సింగ్ విద్యార్థిని

అధికారుల దృష్టికి తీసుకెళ్లా

నేను ఈ మధ్యనే బాధ్యతలు స్వీకరించా. ఇక్కడ అందరం డిప్యుటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నాం. విద్యార్థులకు కావాల్సిన తరగతి గదులు, వసతి గృహం, బస్సు, ల్యాబ్, కార్యాలయ సిబ్బంది వంటి కనీస అవసరాల కోసం అధికారుల దృష్టికి తీసుకెళ్లా. ఇప్పటికే దవాఖాన సూపరింటెండెంట్ డిప్యుటేషన్‌పై సిబ్బందిని కేటాయించారు. వసతి గృహం కోసం 25 బెడ్స్ ఇచ్చారు. సూపరింటెండెంట్ పరిధిలో ఉన్న సౌకర్యాలను ఎప్పటికప్పుడు కల్పిస్తున్నారు. ఏ అవసరం ఉన్నా మాతో సమన్వయం చేస్తూ సహకరిస్తున్నారు.

- ప్రభావతి, నర్సింగ్ పాఠశాల ప్రిన్సిపాల్

మౌలిక వసతులు కల్పించాం

నర్సింగ్ పాఠశాలల్లో చాలా సమస్యలు ఉన్నాయని నా దృష్టికి వచ్చింది. డైట్ విషయంలో కాంట్రాక్టర్‌ను పిలిపించి మాట్లాడాం. విద్యార్థులకు పూర్తి స్థాయిలో మెనూతో నాణ్యమైన ఆహారం అందించాలని ఆదేశాలు జారీ చేశాం. పాఠశాలలో ట్యూటర్స్, సిబ్బంది కొరత ఉందని తెలుపగానే వెంటనే డిప్యూట్ చేశా. వసతి గృహంలో బెడ్స్ లేకపోవడంతో ప్రస్తుతం 25 బెడ్లను సమకూర్చాం. రూంలు మరమ్మతులు అయ్యాక పూర్తిస్థాయిలో పంపిస్తా. మౌలిక వసతులను పూర్తి స్థాయిలో అందించేందుకు చర్యలు తీసుకుంటాం. నర్సింగ్ పాఠశాల వసతి గృహంలో పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించాలని ఇప్పటికే ప్లంబింగ్, ఎలక్ట్రిసిటీ, శానిటేషన్ సిబ్బందిని ఆదేశించా.

-డాక్టర్ గుండా వీరారెడ్డి, జీజీహెచ్ సూపరింటెండెంట్

పెండింగ్ వేతనాలేవి?

కరీంనగర్ ప్రధాన దవాఖాన ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

కరీంనగర్ విద్యానగర్, ఆగస్టు 2: కరీంనగర్ ప్రభుత్వ దవాఖానలో పని చేస్తున్న తమకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులు డిమాండ్ చేశారు. మూడు నెలల నుంచి కాంట్రాక్టర్ వేతనాలు చెల్లించడం లేదని ప్రభుత్వ హాస్పిటల్స్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు బండారి శేఖర్ ఆధ్వర్యంలో గత నెలలో సమ్మె నోటీసు ఇచ్చినా ఫలితం లేదని మండిపడ్డారు. ఈ మేరకు శుక్రవారం జీజీహెచ్ ఎదుట ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా కార్మికులనుద్దేశించి శేఖర్ మాట్లాడుతూ, కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేసి ప్రభుత్వమే నేరుగా కార్మికులకు వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మూడు నెలల పెండింగ్ వేతనాలతోపాటు పీఎఫ్, ఈపీఎఫ్ కార్మికుల ఖాతాలో జమ చేయాలని, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, కార్మికులందరికి ఐడీ కార్డులు ఇవ్వాలన్నారు. ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి యుగేందర్ ధర్నాకు సంపూర్ణ మద్దతు తెలిపారు. యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు అరుణ్, కళావతి, ఉపాధ్యక్షురాలు శారద, నాయకులు సరళ, రేఖ, సతీష్, సాయి, అరుణ్, దివ్య, జ్యోతి, అంజలి పాల్గొన్నారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డి మాట్లాడుతూ, కార్మికులకు మూడు నెలల వేతనాలను అధికారులతో మాట్లాడి బడ్జెట్ రిలీజ్ చేయించామని, నేరుగా కార్మికుల ఖాతాల్లోనే జమ అవుతాయని చెప్పారు. సీజనల్ వ్యాధులు సమీపిస్తున్న సమయంలో కార్మికులందరూ విధిగా డ్యూటీలకు హాజరుకావాలని సూచించారు. కాగా, దాదాపు 200 మంది కార్మికులు ధర్నాకు దిగడంతో ఒక్క రోజులోనే దవాఖానలో అపరిశుభ్రత ఏర్పడింది. రోగులను వారి బంధువులే వీల్ చైర్లు, స్ట్రెచర్లపై తీసుకెళ్లి వైద్యం చేయించుకున్నారు.

ఉపాధి లేకనే నేతన్నల ఆత్మహత్యలు

- కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకే ఈ పరిస్థితి
- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

మ్యాకవెంకయ్యపల్లిలో ఆత్మహత్య చేసుకున్న నేత కార్మికుడు మల్లేశం కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ మంత్రి ఈశ్వర్

పెగడపల్లి, ఆగస్టు 2: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఉపాధి లేక నేత కార్మికులు జీవనోపాధి కరువై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆవేదన వ్యక్తం చేశారు. పెగడపల్లి మండలం మ్యాకవెంకయ్యపల్లిలో ఉపాధి లేక, జీవనోపాధి కరువై అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న నేత కార్మికుడు గుండేటి మల్లేశం కుటుంబ సభ్యులను శుక్రవారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బీఆర్ఎస్ పాలనలో బతుకమ్మ చీరెల ఆర్డర్లతో నేత కార్మికుల జీవితాల్లో కేసీఆర్ వెలుగులు నింపితే, కాంగ్రెస్ పాలనలో సీఎం రేవంత్‌రెడ్డి వారికి ఎలాంటి ఉపాధి అవకాశాలు కల్పించకుండా వారి జీవితాల్లో చీకట్లు నింపుతున్నారని దుయ్యబట్టారు. ఇప్పటికైనా నేత కార్మికులకు సరైన ఉపాధి అవకాశాలు కల్పించి, మృతి చెందిన నేత కార్మికుల కుటుంబాలకు ₹10 లక్షల చొప్పున పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నామాపూర్‌లో పలువురు మృతుల కుటుంబాలను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు లోక మల్లారెడ్డి, పార్టీ నాయకులు ఉప్పుగండ్ల నరేందర్‌రెడ్డి, ఇనుకొండ మోహన్‌రెడ్డి, ఇనుగాండ్ల కరుణాకర్‌రెడ్డి, నారెడ్డి రాజిరెడ్డి, కోరుకంటి రాజేశ్వర్‌రావు, తిర్మణి నర్సింహారెడ్డి, నగావత్ తిరుపతినాయక్, బాబుస్వామి, పెద్ది సంతోష్, వెల్మ సత్యనారాయణరెడ్డి, గాండ్ల సత్తయ్య, నాగుల రాజశేఖర్‌గౌడ్, పలుమారు విజయ్‌యాదవ్, గోలి సంజీవరెడ్డి, జేరిపోతుల శ్రీనివాస్, అందె వెంకటేశం, కనకయ్య పాల్గొన్నారు.

సర్వేయర్ల బదిలీ

కరీంనగర్ కలెక్టరేట్, ఆగస్టు 2 : భూరికార్డులు, కొలతల శాఖలో సర్వేయర్లుగా కొనసాగుతున్న పలువురికి స్థానచలనం కలిగింది. పలు మండలాల్లో విధులు నిర్వహిస్తున్న వీరంతా రాజన్న సిరిసిల్ల జోన్ పరిధిలోని పలు జిల్లాలకు బదిలీ అయ్యారు. వీరిలో రాకేశ్, జీవన్‌ను కామారెడ్డికి స్థానచలనం కల్పించారు. శ్యామలను సిద్ధిపేటకు కేటాయించగా, ఆమె స్థానంలో వంశీ రానున్నారు. వేణు, మధు, సంపత్ రాజన్న సిరిసిల్ల జిల్లాకు బదిలీ కాగా, వారి స్థానంలో రాజేంద్రప్రసాద్, కుమారస్వామి, బాల మురళీకృష్ణ, మురళీ, శ్రీధర్ ఇక్కడికి రానున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. వీరికి ఇంకా బదిలీ ఉత్తర్వులు అందకపోవడంతో ఈ నెల 4లోపు విధుల్లో చేరనున్నట్లు తెలుస్తోంది. కాగా, ఇప్పటికే ల్యాండ్ అండ్ సర్వే విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ అశోక్ నిజామాబాద్ జిల్లాకు బదిలీ కాగా, ఆయన స్థానంలో హన్మకొండ నుంచి ప్రభాకర్ జిల్లాకు బదిలీ అయిన విషయం విదితమే. ఏడీ ప్రభాకర్ సోమవారం లోపు విధుల్లో చేరనున్నట్లు ఆ శాఖ వర్గాల సమాచారం.

ప్రేమపెళ్లి చేసుకున్నదని కూతురు కిడ్నాప్

- సినీ ఫక్కీలో అపహరించిన తల్లి, బాబాయి
- చేజ్ చేసి పట్టుకున్న పోలీసులు
- ఐదుగురు నిందితుల రిమాండ్

వీణవంక, ఆగస్టు 2 : ప్రేమించి పెళ్లి చేసుకున్నదని కూతురిని కిడ్నాప్ చేయగా, పోలీసులు రక్షించారు. వీణవంక మండలం చల్లూరులో సినీ ఫక్కీలో జరిగిన ఈ ఘటన శుక్రవారం సంచలనం సృష్టించింది. పోలీసుల వివరాల ప్రకారం.. చల్లూరుకు చెందిన శివరాత్రి అక్షయ, కొంచెం సంతోష్ ఐదేళ్లుగా ప్రేమించుకుని, ఈ నెల 22న వివాహం చేసుకున్నారు. ఇది ఇష్టంలేని అక్షయ తల్లి శివరాత్రి గంగాజమున, బాబాయ్ శివరాత్రి శంకర్, మరో ముగ్గురు శుక్రవారం ఉదయం కారులో సంతోష్ ఇంటికి వెళ్లారు. తలుపులు పగులగొట్టి ఇంట్లోకి చొరబడి సంతోష్, అక్షయను దూషించారు. అంతే కాకుండా, అక్షయను కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించగా అడ్డం వెళ్లిన సంతోష్ తల్లి చేతిపై రాడ్‌తో కొట్టారు. భయభ్రాంతులకు గురి చేసి, అడ్డం వచ్చిన వారిని చంపుతానని బెదిరించారు. అక్షయకు మత్తు స్ప్రే కొట్టాలని ప్రయత్నించగా, తానే కొట్టుకుంటానని తీసుకొని చాకచక్యంగా దానిపై ఉన్న క్యాప్‌ను తొలగించించింది. దీంతో స్ప్రే పని చేయకపోవడంతో అక్షయను బలవంతంగా కారులో ఎక్కించుకొని పారిపోయారు. వెంటనే అక్షయ భర్త సంతోష్ వీణవంక పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కారులో వెళ్తున్న వ్యక్తి ఫోన్‌ను ట్యాప్ చేశారు. ధర్మపురి ప్రాంతంలో ఉన్నట్లు గుర్తించి అక్కడి పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు చేజ్ చేసి పట్టుకున్నారు. తర్వాత వీణవంక ఎస్ఐ తోట తిరుపతి ఆధ్వర్యంలో పోలీసులు వెళ్లి నిందితులను అరెస్ట్ చేసి అక్షయను సురక్షితంగా స్టేషన్‌కు తీసుకువచ్చారు. అక్షయ భర్త సంతోష్ ఫిర్యాదు మేరకు దాడి చేసి, కిడ్నాప్‌కు యత్నించిన శివరాత్రి గంగాజమున, శివరాత్రి శంకర్, పల్లెపు రాజు, పల్లెపు రజిత, శివరాత్రి రాజలింగంపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ తిరుపతి తెలిపారు.